క్లుప్తంగా

పీవీ సంస్కరణలతో దేశం అభివృద్ధి



సిద్దిపేటలో పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సతీష్‌కుమార్

సిద్దిపేటకమాన్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సిద్దిపేటలో కాంగ్రెస్ నాయకుడు మార్క సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కోహెడలో..

కోహెడ(హుస్నాబాద్): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 103వ జయంతిని స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం పీవీ సేవా సమితి అధ్యక్షుడు పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

న్యూఢిల్లీలో..

గజ్వేల్: న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన పీవీ నర్సింహారావు 103వ జయంతిలో గజ్వేల్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ శాఖామాత్యులు శ్రీధర్‌బాబు హాజరయ్యారు. అలాగే గజ్వేల్‌కు చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, నాయకులు నాయిని యాదగిరి, గోపాల్‌రావు, తీగుల్ మాజీ సర్పంచ్ భాను, గజ్వేల్, ములుగు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి, శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



కరుణాకర్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. కుకునూరుపల్లి పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కరుణాకర్ శుక్రవారం సిద్దిపేట టూటౌన్‌కు బదిలీ అయ్యింది. ఆయనకు ఎస్ఐ, సిబ్బంది వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పనిచేసిన చోట ఎలా ఉద్యోగ ధర్మాన్ని పాటించామన్నది ముఖ్యమన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



కిషన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాయపోలు(దుబ్బాక): ఏ ఉద్యోగికైనా విరమణ తప్పదని రాయపోలు ఎంఈఓ నర్సమ్మ అన్నారు. మండలంలోని రాంసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బయాలజీ ఉపాధ్యాయుడు పడాల కిషన్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదన్నారు. అలాగే ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత



నగదు పారితోషికం అందజేస్తున్న ఎమ్మెల్సీ

కొండపాక(గజ్వేల్): అనాథ పిల్లల చదువుకు చేయూత అందించినవారు అభినందనీయులని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాలసదనం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులను ..

గజ్వేల్‌రూరల్: పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందించకపోవడం సరికాదని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడారు. ఎడ్యుకేషన్ హబ్‌లను ఏర్పాటు చేసినప్పటికీ మౌలిక సదుపాయాలను కల్పించలేకపోయారని విమర్శించారు. ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

నాణ్యతలేక.. పట్టించుకోక

- మూడు నెలల కిందట సీసీ రోడ్డు నిర్మాణం
- కంకర తేలిన వైనం
- అధికారుల పర్యవేక్షణ కరువు
- క్యూరింగ్ చేసినట్లుగా రికార్డులు



మంజ్యానాయక్ తండాలో కంకర తేలిన సీసీ రోడ్డు

అక్కన్నపేట(హుస్నాబాద్): పది కాలాలపాటు ఉండాల్సిన సీసీరోడ్లు నిర్మించిన మూడు నెలల్లోనే దెబ్బతింటున్నాయి. కాంట్రాక్ట్ దక్కించుకున్న వారు అక్రమాలకు పాల్పడ్డారు. అక్కన్నపేట మండలంలో ఉపాధి హామీ పథకం కింద 2023–24లో సీసీ రోడ్ల నిర్మాణానికి సుమారుగా రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. అందులో అక్కన్న పేట గ్రామానికి రూ.20 లక్షలు, గౌరవెల్లికి రూ.15 లక్షలు, గుడాటిపల్లికి రూ.15లక్షలు, అంతక్కపేటకు రూ.10 లక్షలు, జనగామకు రూ.10 లక్షలు, మల్లంపల్లికి రూ.10 లక్షలు, రామవరం గ్రామానికి రూ.10లక్షలు, చౌటపల్లికి రూ.5 లక్షలు, గొల్లకుంట గ్రామానికి రూ.5 లక్షల చొప్పన కేటాయించారు.

రాకపోకలకు ఇబ్బందులు

మార్చిలో అక్కన్నపేట మండల కేంద్రంలోని మంజ్యానాయక్ తండాలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు కంకర తేలి మరి అధ్వానంగా మారింది. నిర్మాణ సమయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకుండపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్మించాడని తండా వాసులు చెబుతున్నారు. ఇళ్ల ముందు రోడ్డును శుభ్రం చేసేందుకు చీపురుతో ఊడ్చితే కంకర చిప్స్ వస్తున్నాయని మహిళలు మండిపడుతున్నారు. క్యూరింగ్ కూడా సరిగా చేయలేదని ఆరోపిస్తున్నారు. కంకర తేలిన రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు.

అధికారులు పట్టించుకోవడంలేదు



సీసీ రోడ్డు నిర్మాణంలో ఇసుకకు బదులు మట్టితో కూడిన ఇసుక వాడుతున్నారని అధికారులకు సమాచారం ఇచ్చాం. పంచాయతీ రాజ్ అధికారులకు ఎన్నోసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. ప్రస్తుతం సీసీ రోడ్డంతా కంకర తేలింది.

– నూనావత్ మోహన్‌నాయక్, మంజ్యానాయక్‌తండా

రోడ్డును పరిశీలిస్తాం



కంకర తేలిన సీసీ రోడ్డును పరిశీలిస్తాం. నిర్మాణ బిల్లులు కూడా ఇంకా ఇవ్వలేదు. సీసీ రోడ్డు దెబ్బతింటే సదరు కాంట్రాక్టర్‌తో దెబ్బతిన్న రోడ్డు స్థానంలో తిరిగి రోడ్డువేయాలని ఆదేశిస్తాం.

– స్నేహ, పంచాయతీ రాజ్ ఏఈ

ఆరోపణలు మాని అభివృద్ధి చేయండి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిద్దిపేటరూరల్: కేసీఆర్, హరీశ్‌రావులపై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు మాని అభివృద్ధిపై దృష్టిపెట్టాలని నారాయణరావుపేట మండల బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కోనయగారి ఎల్లం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అర్హులకు అందించడం లేదని ఆరోపించారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక మౌలిక వసతులు కల్పించలేని పరిస్థితి నెలకొందన్నారు. నిత్యం ప్రజల కోసం పాటుపడే హరీశ్‌రావు మాటలను తప్పుగా ప్రచారం చేయడం, కాళేశ్వరంలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేస్తూ ప్రభుత్వం కాలం గడుపుతోందన్నారు. సమావేశంలో ఎంపీపీ బాలకృష్ణ, వైస్‌ఎంపీపీ సంతోష్ ముదిరాజ్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, పార్టీ నాయకుడు ఎల్లారెడ్డి, ఎంపీటీసీలు హరీశ్, భాను, నాయకులు కిషన్, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడి చెత్తతో ఎరువు తయారు చేయండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



చెత్త వేరుచేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

హుస్నాబాద్: తడిచెత్తతో ఎరువు తయారు చేసుకొని మొక్కల పెంపకానికి ఉపయోగించుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని ఆరపల్లెలో శుక్రవారం నిర్వహించిన డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో చెత్తను వేరుచేసే విధానంపై అవగాహన కల్పించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి నిల్వతో దోమలు వృద్ధి చెంది అనారోగ్యాలకు గురవుతారన్నారు. ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ వేణు యాదవ్, కోఆప్షన్ సభ్యురాలు లలిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవికుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: ప్రతిమ ఫౌండేషన్ ఇచ్చే ఉపాధి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఎలక్ట్రికల్, సోలార్, టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. శిక్షణ పొందేవారికి ఉచిత భోజన వసతి, శిక్షణ అనంతరం ప్లేస్‌మెంట్ కల్పిస్తుందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ ముత్యాల రాజు, ఫౌండేషన్ ప్రతినిధులు గీతారెడ్డి, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

వేలం వాయిదా

వర్గల్(గజ్వేల్): వర్గల్ తైబజార్ వేలం పాట సోమవారానికి వాయిదా పడింది. శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన వేలం పాటలో ఎవరూ పాల్గొనలేదు. దీంతో వాయిదా నిర్ణయం తీసుకున్నామని మండల పంచాయతీ అధికారి ఖలీం తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఎంపిక



క్రీడా పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మద్దూరు(హుస్నాబాద్): స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతి ప్రవేశాలకు మండల స్థాయి ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ శర్మ అధ్యక్షతన మండల ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఇంతియాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పోటీల్లో 26 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఈటీ ఇంతియాజ్ మాట్లాడుతూ పోటీల్లో పది మంది ఎంపికైనట్లు తెలిపారు. వారందరికీ జిల్లాస్థాయి గ్రీన్ ఫీల్డ్ స్టేడియం ఎంపికకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, శ్రీశైలం, గౌరీషా తదితరులు పాల్గొన్నారు.

ట్రైకోడెర్మా విరిడేతో భూసార పెంపు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని జనగామలో శుక్రవారం ట్రైకోడెర్మా విరిడేతో తెగుళ్ల నివారణపై రైతులకు క్షేత్రప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ శ్రీలత మాట్లాడుతూ పంటల సాగు పెట్టుబడి అదుపులో ఉంచి నాణ్యమైన సేంద్రీయ ఉత్పత్తులను సాధించేందుకు క్షేత్రస్థాయిలో ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ విధానంలో జీవశిలీంద్రాలు ఉపయోగపడతాయని, వీటిలో ట్రైకోడెర్మా విరిడి ఉపయోగపడుతుందన్నారు. నారులో నారుకుళ్లు, పత్తి, మొక్కజొన్నలో వేరుకుళ్లు వ్యాప్తిని అరికడుతుందన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



అనంతరెడ్డి



సంజీవ్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల తహసీల్దార్‌గా వి.అనంతరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలుంటే నేరుగా రైతులు తనను సంప్రదించాలన్నారు. దళారులను నమ్మి మోసపోవొద్దన్నారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఇంజమూరి సంజీవ్‌కుమార్ మద్దూరు మండలానికి బదిలీ అయ్యారు.

మద్దూరు తహసీల్దార్‌గా ..

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల తహసీల్దార్‌గా ఇంజమూరి సంజీవ్‌కుమార్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన అక్కన్నపేట మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన అనంతరెడ్డి బదిలీపై అక్కన్నపేట మండలానికి వెళ్లారు.

పశువులకు టీకా వేయించాలి



పశువుకు టీకాలు వేస్తున్న సిబ్బంది

జగదేవ్‌పూర్(గజ్వేల్): పశువులకు సోకే లంపి (ముద్ద చర్మ) వ్యాధి నివారణ టీకాలు వేయించాలని బీఎంసీయూ మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని అలిరాజ్‌పేట గ్రామంలో పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఆగస్టు 10 వరకు కొనసాగుతుందన్నారు. గ్రామంలో 68 పశువులకు టీకా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు రమేష్, గోపాల మిత్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల పంపిణీకి చొరవ చూపండి

- ఆర్డీఓకు మున్సిపల్ చైర్మన్ రాజమౌళి వినతి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి శుక్రవారం ఆర్డీఓ బన్సీలాల్‌కు కౌన్సిలర్లతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో లబ్ధిదారుల ఎంపిక జరిగిందని, వివిధ కారణాలతో కేటాయించలేదన్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, అత్తెల్లి శ్రీనివాస్, బాలమణి, బబ్బూరి రజిత, రహీం, అల్వాల బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

అడవి పందుల బీభత్సం

- మొక్కజొన్న మొక్కలను తినేసిన వైనం
- ఆందోళనలో రైతులు
- నష్టపరిహారం ఇవ్వాలని ఆందోళన



బంగారులొద్ది తండాలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతులకు పంటల సాగులో అవస్థలు తప్పడం లేదు. గుట్టలు, కొండల మధ్య నివాసం ఉండే గిరిజనులకు అడవి పందులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అర్ధరాత్రి పొలాల్లోకి చొరబడి బీభత్సవం సృష్టిస్తున్నాయి. వీటి దాడితో పత్తి, మొక్క జొన్న, వరి సాగు చేసే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అక్కన్నపేట మండలం రామవరం గ్రామ పంచాయతీ పరిధి బంగారులొద్దితండా, నందారం స్టేజి వద్ద ఏర్పాటైన పునరావాస కాలనీ రైతులు మొక్కజొన్న సాగుచేస్తున్నారు. శుక్రవారం అడవి పందులు మొక్కలను తిన్నాయి. ఒక్కో రైతు సుమారు రూ.30 వేల వరకు పంట సాగుకు ఖర్చు చేశారు. మొత్తం రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా అడవి పందులతో పత్తి, మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతింటున్నాయని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. అటవీ శాఖ అధికారులు స్పందించి అడవి పందుల నుంచి పంటలను రక్షించి తమకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పెద్దతండా గ్రామానికి బస్సు సౌకర్యం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పెద్ద తండా గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడారు. తండాకు బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వెంటనే ఆయన స్పందించి బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఏళ్లతరబడి కిలో మీటర్ల మేర నడుచుకుంటూ ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. బస్సు సౌకర్యం కల్పించడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టులు బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో కళాశాలలో ఆంగ్లం, సంస్కృతం, తెలుగు, కంప్యూటర్ సైన్స్, గణితం, మైక్రో బయాలజీ బోధించేందుకు ఒక్కోపోస్ట్ ఖాళీగా ఉందన్నారు. ఆయా సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులున్నవారు అర్హులన్నారు. అదే విధంగా నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు జూలై 2 లోపు దరఖాస్తు చేసుకోవాలని, జూలై 4న కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

సిద్దిపేటఎడ్యుకేషన్: గెస్ట్ లెక్చరర్‌గా బోధించేందుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆంగ్లం, తెలుగు, గణితం, చరిత్ర, అర్థశాస్త్రం, కంప్యూటర్స్‌లో ఒక్కో పోస్టు, వ్యాపారాగణాంకశాస్త్రంలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. జనరల్ అభ్యర్థులు పీజీలో సంబంధిత సబ్జెక్టులో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు ఉన్నవారు అర్హులున్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, బోధనానుభవం ఉన్నవారు సర్టిఫికెట్ సమర్పిస్తే వెయిటేజీ ఉంటుందని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు జూలై 2 సాయంత్రం 5 గంటలలోగా కళాశాలలో తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. జూలై 3న అభ్యర్థులకు డెమో, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ ఇళ్ల పట్టాలు ఇవ్వండి

దుబ్బాకటౌన్: డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని దుబ్బాక మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏసురెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. లబ్ధిదారులు గృహ ప్రవేశం చేసి రెండేళ్ల గడుస్తున్నా అధికారులు ఎందుకు పట్టాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అసలైన లబ్ధిదారులను గుర్తించి వారికి మాత్రమే ఇళ్లు పంపిణీ చేయాలన్నారు.

◆ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు రాజగోపాల్‌పేట పోలీసులు తెలిపారు. ఖాత గ్రామానికి చెందిన పరమేశ్వర్, మహేందర్, పరమేశ్వర్‌రెడ్డి గ్రామంలోని మోయతుమ్మెద వాగు నుంచి తెల్లవారు జామున అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, రాజగోపాల్‌పేట పోలీసులు దాడి చేసి మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

తొగుట(దుబ్బాక): నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ కో ఆర్డినేటర్ చెరుకు విజయ్‌రెడ్డి అన్నారు. మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోదండ రేణుక ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. శుక్రవారం ఆమెను పరామర్శించారు. పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కృషితో ప్రభుత్వం ఆమె వైద్య ఖర్చుల కోసం రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేసింది. ఆ పత్రాలను రేణుకకు అందజేశారు.

◆ మెరుగైన వైద్యం కోసం..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన శ్రీరాముల విజేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడికి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం రూ.80 వేల ఎల్‌ఓసీ మంజూరు చేసింది. ఆ పత్రాలను జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం విజేందర్‌కు అందజేశారు.

◆ స్కూల్‌ని సీజ్ చేయాలి

సిద్దిపేటజోన్: ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేటు స్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ అనుమతి లేకుండా పట్టణంలో పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారని, విద్యాశాఖ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

◆ వ్యవసాయ అధికారిగా ఎంపిక

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన బద్దిపడిగె హన్మంతరెడ్డి చిన్న కూతురు భానుశ్రీ ఇటీవల విడుదలైన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన అగ్రికల్చర్ ఆఫీసర్ పరీక్షలో 109 ర్యాంక్ సాధించింది. అగ్రికల్చర్ ఆఫీసర్‌గా ఎంపికైంది. భానుశ్రీని గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

◆ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డీఈఓ ఆఫీస్ ముట్టడి

ప్రశాంత్ నగర్(సిద్దిపేట): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో డీఈఓ ఆఫీస్ ముట్టడించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ వివేక్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలేదన్నారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

◆ వానాకాలం సీజన్.. ముందస్తు చర్యలు చేపట్టాలి

గజ్వేల్: వానాకాలం సీజన్‌కు సంబంధించి మున్సిపాలిటీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్యంతోపాటు ఇతర సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. సమావేశంలో 20 అజెండా అంశాలకుగాను 19 అంశాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

◆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీజనల్ వ్యాధులుపై ప్రతీఒకరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సత్యప్రకాష్ అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా జగదేవ్‌పూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.